


దేశానికి స్వాతంత్ర్యం వచ్చి నలభయ్యేళ్లయింది. ఆ సందర్భంగా దేశమంతా పండుగ జరుపుకుంటోంది. లక్షలు ఖర్చు చేసి దేశ వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేసింది ప్రభుత్వం.

ఆ శుభ సందర్భంలో - నలభయ్యేళ్ల స్వాతంత్ర్యంలో దేశము, పార్టీ సాధించిన ప్రగతిని ప్రజలలో చాటవలసిందిగా, ప్రచారం కోసం తన ప్రతినిధులను వివిధ ప్రాంతాలకు పంపించాడు బడా నాయకుడు త్వరలో రానున్న ఎన్నికలను దృష్టిలో వుంచుకొని.

అలా దేశం నలుమూలలకూ వెళ్లిన ఛోటా నాయకులలో ఒకరు ఒక బహిరంగ సభలో ఎంతో వుత్సాహంగా, వుత్తేజంగా ప్రసంగిస్తూ దేశం సాధించిన ప్రగతి, అందు కోసం తమ పార్టీ చేసిన త్యాగాలూ ఏకరువు పెడుతున్నాడు- ''సోదర సోదరీ మణులాలా! ఈ నలభయ్యేళ్ల స్వాతంత్ర్యంలో ప్రపంచంలో ఏ దేశమూ సాధించలేనంత ప్రగతి, అభివృద్ధి సాధించింది మన దేశం. ప్రపంచంలో ముఖ్యమైన దేశంగా గుర్తింపు పొందింది. అగ్రరాజ్యాలను సయితం గడగడలాడించే మహాశక్తిగా రూపొందింది. ఎన్నో ప్రపంచ సంస్థలలో ప్రాముఖ్యతను సాధించడమే కాక కొన్నిటికి నాయకత్వాన్ని కూడా వహించింది. ప్రపంచంలో శాంతిభద్రతలు నెలకొనేందుకు అవిరళ కృషి చేసి శాంతిదూతగా ఘన కీర్తి సంపాదించింది.... ఇకపోతే, ఎన్నో అభివృద్ధి పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలను పెంచింది. అట్టడుగు జాతి వారికి సయితం సమాజంలో ఆర్థికంగా, అన్యథా సమాన స్థాయిని కల్పించింది. ఆకలి చావులను అరికట్టింది. స్త్రీల అభ్యున్నతిని సాధించింది. ఆకాశంలోకి రాకెట్లను పంపించింది. దేశంలో గ్రామ గ్రామాలకు టెలివిజన్‌ని తీసుకురాగలిగింది. అంటార్కిటికాకు మనుషులను పంపించి, ఇంతవరకూ ఏ దేశమూ సాధించలేని ఘన విజయాన్ని సాధించింది. అన్ని రంగాలలోనూ అనతి కాలంలోనే అత్యంత వున్నతిని సాధించింది. ప్రపంచ దేశాలలో మన దేశ ప్రగతిని, సంస్కృతినీ చాటే నిమిత్తం ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నాము మనము. ఇది మనలో ప్రతి ఒక్కరూ గర్వించవలసిన విషయం......'' గొర్రెల మందలాంటి జనం ఆనందంతో చప్పట్లు చరిచింది. అలుపు తీర్చుకునేందుకని ఓ క్షణం ఆగాడు ఛోటా నాయకుడు, గర్వంగా అందరి వంకా కలయజూస్తూ.

ఆ సమయంలో ఓ ఎడి వయస్కుడు జనంలోంచి లేచి నిలుచున్నాడు. ఛోటా నాయకుడికి నమస్కరించి వినయంగా ఇలా అన్నాడు- ''ఇవే మాటలు నేను చెబితే మా గ్రామపోళ్లు నమ్మకోవడం లేదు బాబూ. నువ్వు దయుంచి ఓ పారి మావూరొచ్చి వాళ్లకు కాస్త తెలియ జెప్పాలి నా మనవి!''

ఛోటా నాయకుడు ఆనందంగా అందుకు ఒప్పుకున్నాడు. అక్కడి నుంచి సరాసరి ఆ గ్రామానికి వెళ్లాడు తన అనుచరులతో కలిసి.

నాయకుడు గ్రామానికి వస్తున్నాడన్న వార్త అందగానే పిల్లా-పాపా, చిన్నా-పెద్దా, ఆడ-మగా అంతా వీథిలోకి ఎదురొచ్చారు.

ఛోటా నాయకుడి జీపు ఆ గుంపు మధ్యగా మెల్లగా వెళుతోంది. అతని పక్కనే వున్న ఆ సామీ ఒక చోట జీపు ఆపించాడు.

''అలా చూడు బాబూ! - ఇంతకు ముందు నువ్వు చెప్పావే - ఆ ప్రగతి వాళ్లలో స్పష్టంగా కనిపించడం లేదూ?'' అన్నాడు ఛోటా నాయకుడితో, గుంపులో ఒక వైపుకు చూపిస్తూ.

అటు వైపుకు దృష్టి సారించిన ఛోటా నాయకుడు చిన్నగా వులిక్కి పడ్డాడు. ఏమనడానికీ తోచక తడబడ్డాడు.

గుంపులో అక్కడ-వయసొచ్చిన ఆడపిల్లలు, పరువంలో వున్న యువతులు, పెళ్లయిన స్త్రీలు... ఒంటికి చుట్టుకున్న ఓ పాత చీరె తప్ప, ఏ ఒక్కరి వంటి మీదా రవికె అన్నది లేదు!!

మోకాళ్ల క్రింద నుంచి చుట్టుకున్న, ఒంటికి అతుక్కుపోయిన, చాలీ చాలని చీరె చెంగు వక్షాన్ని సరిగా కప్పలేకపోతుంటే అర్ధనగ్నంగా వున్నారంతా.

అందరి చూపులూ తమ మీద పడడంతో నగ్న వక్షాల మీదకు కంగారుగా చెంగులు లాక్కుంటూ సిగ్గుతో తలలు వంచుకున్నారు ఆ వనితలు.

అది చూసిన ఆసామీ, ''సిగ్గు పడవలసింది మీరు కాదమ్మా! నలభయ్యేళ్ల స్వాతంత్ర్యంలో తన ఆడకూతుళ్ల వక్షాలను కూడా సరిగా కప్పలేకపోయినందుకు ఈ దేశం సిగ్గుపడాలి! స్వాతంత్ర్యం వచ్చిందంటూ సభలు చేసి, ప్రగతి సాధించామంటూ ప్రగల్భాలు పలుకుతూ, వాస్తవాన్ని గుర్తించలేని మన నాయకులు సిగ్గుతో తలలు వంచుకోవాలి!'' అన్నాడు ఆవేశంగా.

చప్పట్లు కొట్టారంతా.

ఛోటా నాయకుడ్ని వుద్దేశించి ఇలా అన్నాడతను- ''బాబూ! పట్టణాలలో గాలి మేడల్లో నివసిస్తూ, గాలి ఓడల్లో తిరుగుతూ, రంగుటద్దాలలోంచి చూస్తూ దేశం ప్రగతి సాధించిందంటూ మైక్‌లు పగలగొడితే సరిపోదు బాబూ! పల్లెల కొచ్చి, సామాన్యుడి బ్రతుకును కళ్లారా గాంచి, అపుడు చెప్పండి - ఈ నలభయ్యేళ్ల స్వాతంత్ర్యంలో దేశం పురోగమించిందో, తిరోగమించిందో! కోట్లు వెచ్చించి విదేశాలలో ఎగ్జిబిషన్లు పెడితే ప్రగతి రాదు... ఎక్కడో వున్న మంచు సముద్రానికి మనుషుల్ని పంపిస్తే అది ప్రగతి కాదు... రాకెట్లు ప్రేల్చి ప్రజాధనాన్ని హారతి కర్పూరం కావిస్తే సామాన్యుడికి ఒరిగేదేమీ లేదు.... ఆడపిల్ల తన సిగ్గు దాచుకునేందుకు అవసరమైన కనీసపు బట్ట, పసివాడు ప్రాణం నిలుపుకునేందుకు పట్టెడు మెతుకులు, మనిషి తల దాచుకునేందుకు గూడూ-ప్రభుత్వం వీటిని సమకూర్చగలిగిన నాడే నిజమైన ప్రగతి బాబూ!''

ఆ పలుకులతో ఛోటా నాయకుడి శిరసు సిగ్గుతో పాతాళానికి క్రుంగిపోయింది.

వాస్తవం సజీవ చిత్రమై కన్నుల ముందు నర్తించడంతో -అక్కడికక్కడే ప్రభుత్వంలో తన పదవికి రాజీనామాను ప్రకటించాడు అతను.